ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- మురసు తుపాను కారణంగా రాష్ట్రానికి 2వేల 484 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు.

- యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ (AEI) ర్యాంకింగ్-2026లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వెల్లడించారు.

- బంగాళాఖాతంలోని వాయుగుండం రేపు తుపానుగాను, ఎల్లుండి తీవ్ర తుపానుగాను మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

==========

మురసు తుపాను కారణంగా రాష్ట్రానికి 2వేల 484 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర బృందానికి తెలిపారు. తుఫాన్ నష్టం అంచనాపై క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసిన కేంద్ర బృందం.. ఈరోజు ముఖ్యమంత్రితో దృశ్యం మాధ్యమం విధానంలో సమావేశమైంది. లక్షా 43 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, లక్షా 86 వేల మంది రైతులు నష్టపోయారని ముఖ్యమంత్రి, కేంద్ర బృందానికి వివరించారు. కోస్తాంధ్రకు తుపాన్ల ముప్పు తరచూ ఉంటున్నందున శాశ్వత పరిష్కారంగా మౌలిక వసతులను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వరి పంటకు తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరులో 90 శాతం వరకు నష్టం జరిగినట్లు గుర్తించామని కేంద్ర బృందం తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని, పంటల బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో పత్తి రైతుల్లో చాలామంది బీమా చేయించుకోలేకపోయారని తెలిపింది.

==========

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలోని నిర్మాణంలో ఉన్న డాక్టర్ అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నెల్లూరులోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునిక వసతులతో ఆధునీకరిస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు పాఠశాలల నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నెల్లూరులో 20 కోట్ల రూపాయల కార్పొరేట్ సామాజిక భాద్యత నిధులతో నిర్మిస్తున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఈ స్కూల్లో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో 550 కోట్ల రూపాయలతో చేపట్టిన తాగునీటి పథకం పనులు పూర్తవుతున్నాయని, డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ ఇస్తామని మంత్రి నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

==========

విజయనగరం సకల కళలకు పుట్టినిల్లు అని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ, సాధికారత, సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి, శ్రీశ్రీ కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు విజయనగరంలో నిర్వహించిన 'సాహిత్య సంగీత సాంస్కృతిక వైభవం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహాకవి గురజాడ అప్పారావు, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు వంటి ఎందరో మహనీయులు నడయాడిన పవిత్రమైన గడ్డపై ఇటువంటి సాహితీ ఉత్సవం జరగడం ఎంతో సంతోషకరమని అన్నారు. సుమారు ఆరు రాష్ట్రాల నుంచి 300 మంది కవులు తమ కవితలను వినిపించడానికి విజయనగరం రావడం సంతోషమన్నారు.

==========

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులోని వరాహ నదిలో నిన్న జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి చెందడంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. యువకులు మృతిచెందడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు.

==========

పశ్చిమగోదావరి జిల్లాలో పురపాలక సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన ఈరోజు పలు నామినేషన్లు దాఖలయ్యాయి. భీమవరం పురపాలక సంఘంలో వార్డులకు 34 నామినేషన్లు, తాడేపల్లిగూడెంలో 53 నామినేషన్లు దాఖలయ్యాయి. పాలకొల్లు పురపాలక సంఘంలో చైర్మన్ పదవికి 2, వార్డులకు 3 నామినేషన్లు దాఖలయ్యాయి.

==========
విరామం
==========

జనజాతీయ గౌరవ దివస్ ను పురస్కరించుకుని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ట్రైఫెడ్ (TRIFED) ఆధ్వర్యంలో విశాఖపట్నం బీచ్ రోడ్డులో 'ఆది బజార్' ప్రదర్శన ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. నవంబర్ 15 నుంచి 24 వరకు జరగనున్న ఆదివాసీ ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాలను ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 40 మంది గిరిజన కళాకారులు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. గిరిజన కళాకారులు నేరుగా వినియోగదారులతో అనుసంధానమై తమ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందేందుకు, వారి ఆర్థిక సాధికారతకు ఈ వేదిక దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విశాఖ నగరవాసులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ ఆది బజార్ ను సందర్శించి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల జీవనోపాధికి అండగా నిలవాలని ట్రైఫెడ్ కోరింది.

==========

యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ (AEI) ర్యాంకింగ్-2026లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో రెండో స్థానంలోను, పెద్ద రాష్ట్రాల్లో మొదటి స్థానంలోను నిలవడం గర్వకారణమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఆదివారం అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ ర్యాంక్ కొలమానమని పేర్కొన్నారు. ప్రాథమిక సౌకర్యాలు, వైద్యం, విద్య, సామాజిక భద్రత, సత్వర న్యాయం అనే ఐదు అంశాల ఆధారంగా ఓపీ జిందాల్ సంస్థ ఈ ర్యాంకింగ్ ఇచ్చిందన్నారు. సామాజిక భద్రతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందని తెలిపారు.

==========

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (VMRDA) పరిధిలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (LRS)లో భాగంగా 2020 సంవత్సరంలో దరఖాస్తు చేసుకుని, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో ప్రత్యేక 'ఎల్.ఆర్.ఎస్ మేళా' నిర్వహించనున్నట్లు వీఎంఆర్‌డీవీ ఇంచార్జ్ కమిషనర్ కేతన్ గార్గ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 2వేల 500 మంది దరఖాస్తుదారులకు ఈ మేళా ద్వారా ప్రయోజనం కలగనుంది.

==========

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (GVMC) ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోన్ల కార్యాలయాల్లో రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (PGRS) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

==========

గ్రామ పంచాయతీల ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రేపు కలెక్టర్ కార్యాలయంలో PGRS కార్యక్రమం రద్దు చేసినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీల స్వీకారం ఉండదని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

==========

ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర-వాయువ్య దిశగా కదులుతున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నానికి 960 కి.మీ, చెన్నైకి 800 కి.మీ దూరంలో, ఒడిశాలోని గోపాల్ పూర్ కు 1070 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని, ఇది రేపు తుపానుగాను, ఎల్లుండి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగాను మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మంగళవారం వరకు కోస్తా తీరం వెంబడి 40–60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు.

==========

భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్యసేన్ జపాన్ మాస్టర్స్-2026 సూపర్ 500 టోర్నీలో పురుషుల సింగిల్స్ టైటిల్ ను గెలుచుకుని ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు నెలకొల్పారు. ఈరోజు జపాన్ లో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో జపాన్ ఆటగాడు కోకి వతనాబే పై 13-21, 21-18, 21-14 తేడాతో లక్ష్యసేన్ విజయం సాధించారు.

==========
==========